క్లుప్తంగా

ఉపాధి పనుల తనిఖీ



పనులను పరిశీలిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

శిరివెళ్ల: యర్రగుంట్లలో జరుగుతున్న ఉపాధి పనులను పీడీ రామచంద్రారెడ్డి గురువారం తనిఖీ చేశారు. రోజుకు ఎంత మంది కూలీలు పనులకు హాజరవుతున్నారని ఆరా తీశారు. రోజుకు 210 మంది పనులకు వస్తున్నారని టెక్నికల్ అసిస్టెంట్ శివలింగం చెప్పారు. పనులను నాణ్యతగా చేయించాలని పీడీ ఆదేశించారు. లక్ష్యానికి మించి పనులు జరుగుతున్నాయని పీడీ సంతృప్తి వ్యక్తం చేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

గోస్పాడు: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులను అనుసరిస్తే మెరుగైన దిగుబడులు లభిస్తాయని నంద్యాల జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ సరళమ్మ, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్ బాబు తెలిపారు. మండలంలోని గోస్పాడు,ఒంటివెలగల, కలుగొట్ల గ్రామాల్లోని పొలాలను గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ కంది, వరి, మినుము, పంటల్లో ప్రదర్శన క్షేత్రాలు, చిరు సంచుల నిర్వహణకు ఆయా రైతు భరోసా కేంద్రాల వ్యవసాయ సహాయకుల ద్వారా రైతులను ఎంపిక చేశామన్నారు. ఆయా గ్రామాల్లో రైతులతో చర్చలు నిర్వహించి సాగులో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పేదరిక నిర్మూలన కోసమే పథకాలు



మాట్లాడుతున్న వెంకటదాసు

నంద్యాల(సిటీ): పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని మెప్మా ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటదాసు తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన పట్టణ పేదరిక నిర్మూలన సీఎంఎం(సిటీ మిషన్ మేనేజర్) విజయభాస్కర్‌రెడ్డి, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా బేతంచెర్ల నగర పంచాయితీ నుంచి వచ్చిన కమ్యూనిటీ ఆర్గనైజర్ శ్రీదేవితో బేతంచెర్లలో ఉన్న సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల వివరాలు, మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించి స్థిరపడేందుకు చేయూత, ఆసరా, జగనన్న తోడు, సున్నా వడ్డీ, పేదలందరికీ ఇళ్లు తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్పీలు, పొదుపు సమాఖ్య మహిళలు పాల్గొన్నారు.

తగ్గిన నూనె ధరలు

నంద్యాల(న్యూటౌన్): వంటనూనె ధరలు దిగి వచ్చాయి. అంతర్జాతీయంగా చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో కొన్ని నెలల క్రితం లీటరుకు రూ.200 నుంచి రూ.220 దాటాయి. అయితే ఇటీవల ధరలు దిగి వస్తూ లీటరు నూనె ధర ప్రస్తుతం రూ.వందకు చేరుకుంది. సన్‌ఫ్లవర్, సోయాబీన్, పామాయిల్ ధరలు బాగా తగ్గడంతో సామాన్యులకు ఊరట లభించింది. ప్రముఖ కంపెనీలు విక్రయించే అన్ని రకాల వంటనూనె ధరలను రూ.10 మేరకు తగ్గించారు. ప్రస్తుతం పామాయిల్ ధర రూ.90 ఉండగా సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.95 నుంచి లభిస్తుంది.

క్రీడా సామగ్రి పంపిణీ

స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో హాకీ క్రీడాకారులకు షిన్ ప్యాడ్స్‌ను డీఎస్‌ఏ ఆధ్వర్యంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణిక్యరాజు గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రాక్టీస్ చేస్తే మెరుగ్గా రాణిస్తారని చెప్పారు. హాకీ ఆంధ్రప్రదేశ్ తరపున తమ సహకారం ఉంటుందన్నారు. ఎస్పీజీ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్, కోచ్ సుదర్శన్,క్రీడాకారుడు ఓబులేసు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(అర్బన్): దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి కోరారు. దివ్యాంగులను అగౌరవ పరిచే వారిని శిక్షించాలని కోరుతూ గురువారం వన్‌టౌన్ సీఐ రామకృష్ణకు అసోసియేషన్ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ ఇటీవల దివ్యాంగులపై దాడులు అధికమయ్యాయన్నారు. సీఐ మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఉయ్యాలవాడ: వర్షాలు ప్రారంభమయ్యాయి.. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి రమేష్‌చంద్ర బాలాజీ తెలిపారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి 0–5 ఏళ్ల లోపు చిన్నారులకు సోకే అతిసార వ్యాధిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. విరేచనాలు అవుతున్నట్లయితే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాపించడంతో పాటు జింక్ మాత్రలు కూడా చిన్నారులకు మింగించేలా చూడాలని చెప్పారు.

కౌలు రైతుకు సర్కారు అభయం

- నెలాఖరు లోపు అర్హులైన కౌలు రైతులందరికీ సీసీఆర్సీ కార్డులు
- యాజమాన్య హక్కులకు భంగం వాటిల్లకుండా భూయజమానులకు అభయం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు దక్కనున్న ప్రయోజనాలు
- నంద్యాల సబ్‌డివిజన్ పరిధిలో 3,956 మంది గుర్తింపు



చాపిరేవులలో కౌలు రైతు చాంద్‌బాషాకు సీసీఆర్సీ పత్రం అందజేస్తున్న ఏడీఏ రాజశేఖర్ (ఫైల్)

నంద్యాల (సెంట్రల్): సొంత భూమి లేని వారు, ఇతరుల పొలాలను కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్న వారికి కూడా ప్రభుత్వం ప్రయోజనం చేకూర్చడానికి చర్యలు చేపట్టింది. సాధారణ రైతుల్లాగే వారికి కూడా ప్రభుత్వ పథకాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, బ్యాంక్ రుణాలు అందించేందుకు పూనుకుంది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ఉన్న సాగు హక్కు పత్రాల జారీ విధానాన్ని ప్రక్షాళన గావించి నూతన విధానాన్ని అమలు లోకి తెచ్చింది. దీని ద్వారా అర్హులైన ప్రతి కౌలుదారులకు పథకాలు అందించడమే కాకుండా నిజమైన భూయజమానుల హక్కులకు భంగం కలుగకుండా విధి విధానాలు రూపొందించారు.

నెలాఖరులోగా అందరికీ కార్డులు

నంద్యాల సబ్‌డివిజన్‌లో నంద్యాల, బండిఆత్మకూరు, గడివేముల, పాణ్యం, మహానంది, బనగానపల్లె పరిధిలో మొత్తం 3,956 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించి చేయూత ఇవ్వాలని ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఇందులో నంద్యాల–815, మహానంది–530, బండిఆత్మకూరు–489, గడివేముల–750, పాణ్యం–556, బనగానపల్లె–816 మంది ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకు 889 మందికి సీసీఆర్సీ కార్డులను అందజేశారు. మిగిలిన వారికి ఈ నెలాఖరులోపు అందజేయనున్నారు.

లబ్ధి ఇలా....

గుర్తింపు కార్డులు పొందటం వల్ల కౌలు రైతులకు మరింత లబ్ధి చేకూరుతుంది. ముఖ్యంగా మిగతా భూయజమానుల మాదిరే బ్యాంకు రుణాలు పొందవచ్చు. సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ చేయించుకోవటంతో పాటు,.మద్దతు ధరకు దిగుబడుల్ని అమ్ముకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 పెట్టుబడి సాయంగా అందుతుంది. అంతేకాక పంటబీమా పరిహారం, పెట్టుబడి రాయితీ లభిస్తుంది. కౌలు రైతుల ఒప్పంద కాలపరిమితి 11 నెలలు ఉంటుంది.

యాజమాన్య హక్కులకు పూర్తి భరోసా..

సీసీఆర్సీ కార్డుల విషయంలో కొందరు భూయజమానులు తమ యాజమాన్య హక్కులకు ముప్పు వాటిల్లుతుందేమోనని భయాందోళన చెందుతున్నారు. వారి అపోహల్లో వాస్తవం లేదని అధికారులు చెబుతున్నారు. కేవలం 11 నెలల కాల పరిమితితో జారీ చేసే కార్డులతో ఎటువంటి సమస్యలు ఎదురుకావని అవగాహన కల్పిస్తున్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు సంయుక్తంగా వీటిపై అవగాహన కల్పించేందుకు గ్రామ సభలు నిర్వహించారు. ఉదారులు సాగుచేస్తున్న భూమి, ఆధార్ వివరాలు, గ్రామ రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులకు అందజేస్తే అర్హత ఆధారంగా గుర్తింపు పత్రం అందిస్తారు.

అన్ని పథకాల లబ్ధి పొందుతున్నా



రెండేళ్లుగా కౌలు కార్డుతో రైతుభరోసా, బీమా, మద్దతు ధర సహా అన్ని రకాల ప్రయోజనాలు పొందుతున్నా. ఈ ఏడాది రెన్యూవల్ చేసి కొత్త కార్డు ఇచ్చారు. వ్యవసాయ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ఎప్పటికప్పుడు నమోదు చేసినందుకు ధన్యవాదాలు. పెట్టుబడి సాయం అందుతుండటంతో అప్పులు చేయాల్సిన అవసరం తప్పింది. ఎరువులు, విత్తనాలు మా ఆర్‌బీకే లో అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాలుగా ప్రభుత్వం తోడుగా ఉండటంతో వ్యవసాయం పండగలా మారింది.

–చాకలి సుబ్బరాయుడు, పులిమద్ది, నంద్యాల మండలం

చిన్న, సన్నకారు రైతులకు మేలు



ఏటా 5 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తా. పెట్టుబడికి, ఇతర అవసరాలకు అప్పు చేయాల్సి వచ్చేది. దీంతో పాటు వర్షాలు అధికంగా కురిసి పంట నష్టం జరిగితే నష్టాలు మిగిలేవి. సీసీఆర్సీ కార్డు వచ్చినప్పటి నుంచి మిగతా పెద్ద రైతుల మాదిరే నాకూ రైతు భరోసా, బీమా అందుతుండటంతో నిశ్చింతగా సాగు చేసుకుంటున్నాను.

– ఆలకుంట ఎల్లయ్య, పెసరవాయి, గడివేముల మండలం

లక్ష్యం పూర్తి చేస్తాం

సీసీఆర్సీ కార్డుల జారీలో కాస్త జాప్యం జరుగుతుండటంతో కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక పనిదినాల్ని కేటాయించాం. ఈ నెలాఖరులోగా అందరికీ కార్డులు అందజేస్తాం. వీటిపై భూ యజమానులు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దు. ఇది తాత్కాలిక ఒప్పందం మాత్రమే. కార్డులతో కౌలు రైతులకు మిగతా భూయజమానుల మాదిరిగానే అన్ని రకాల ప్రయోజనాలూ అందుతాయి.

– రాజశేఖర్, ఏ, నంద్యాల సబ్‌డివిజన్

ఖరీఫ్ సాగు ప్రారంభం



మాయలూరు సమీపంలో మొక్కజొన్న విత్తనాలు నాటుతున్న కూలీలు

ఉయ్యాలవాడ : మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు మోస్తారు వర్షం కురిసింది. 67.6 మి.మీ. వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. దీంతో కుందూనది తీరం వెంట ఏటా 950 హెక్టార్లలో వరి పంట సాగయ్యేది. అయితే ఈ ఏడాది వరికి ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. మాయలూరు, ఇంజేడు, హరివరం, ఉయ్యాలవాడ, పెద్దయమ్మనూరు, తదితర గ్రామాల్లో మొక్కజొన్న సాగు చేసే పనుల్లో రైతులు, వ్యవసాయ కూలీలు నిమగ్నమయ్యారు. మార్కెట్‌లో క్వింటా రూ.2,200 వరకు ధర ఉండటంతో పాటు పెట్టుబడి వరితో పోలిస్తే తక్కువ ఖర్చవుతుండటం , రెండు, మూడు తడుల నీటితోనే దిగుబడి చేతికి వస్తాయని రైతులు పేర్కొంటున్నారు.

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయ స్వామికి విశేషపూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

జగజ్జననీ మాతకు సారె సమర్పణ



సారె సమర్పిస్తున్న కర్ణాటక భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగ్గనినీ నగర్‌లో వెలసిన శ్రీజగజ్జననీ మాతకు ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని గురువారం కర్ణాటక, ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కొందరు అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజామునే వేద పండితుల ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం కర్ణాటక, ప్రొద్దుటూరు, గుంటూరు, బళ్లారి, పిడుగురాళ్ల, పీలేరు, పోరుమామిళ్ల నుంచి భక్తులు అమ్మవారి ప్రతిమలతో ఇంటి నుంచి తీసుకొచ్చిన చీర, సారెను సమర్పించారు. దుర్గాఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నంద్యాల(న్యూటౌన్): పాఠశాల విద్యాశాఖ పరిధిలో డిప్యూటీ ఈఓ పోస్టులను ఉమ్మడి సీనియారిటీ ఆధారంగా కల్పించాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్యంలో పని చేస్తున్న ఎంఈఓల ద్వారా గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులను భర్తీ చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన వారు మాత్రమే ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పరిగణింపబడుతారన్నారు. ప్రభుత్వం కామన్ సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని, జీవోలపై కోర్టులో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి, కార్యదర్శి సాంబశివుడు, మధుసూదనరావు, పుల్లయ్య, మునిస్వామి, పవన్‌కుమార్, సుబ్బరాయుడు, జయరాం, రవి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం ప్రాణాంతకం



నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని సూచిస్తున్న పీసీబీ ఏఈ ప్రతాప్

నంద్యాల(సిటీ): ప్లాస్టిక్ వినియోగం ప్రాణాంతకమని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ప్రతాప్ తెలిపారు. గురువారం మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణతో కలిసి పలు దుకాణాలు, హోటళ్లలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రి, సాయిబాబానగర్ ప్రాంతాల్లోని పలు దుకాణాల్లో సుమారుగా 50 కిలోల నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. మొదటిసారిగా దొరికిన దుకాణాల నిర్వాహకులకు అవగాహన కల్పించారు.

నాడు–నేడు పనులు త్వరగా పూర్తి చేయించండి



రెడ్డిపల్లెలో వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ ఈఓ

రుద్రవరం: అసంపూర్తిగా ఉన్న నాడు–నేడు పనులను త్వరగా పర్తి చేయించాలని డిప్యూటీ ఈఓ మహమ్మద్ గౌస్ హెచ్ఎంలకు సూచించారు. మండలంలోని రుద్రవరం,నర్సాపురం,పెద్దకంబలూరు,ఎల్లావత్తుల జెడ్పీ ఉన్నత పాఠశాలలు, రెడ్డిపల్లె, మాచినేనిపల్లె, బి.నాగిరెడ్డిపల్లె,కొండమాయపల్లె, చిన్నకంబలూరు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను గురువారం పరిశీలించారు. ఆయా పాఠశాలల పరిధిలోని జగనన్న విద్యా కానుక కిట్లు అందాయా లేదా అని విద్యార్థులు, తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓలు కోటయ్య,శ్రీలక్ష్మి,సీఆర్పీలుశ్రీనివాసులు,శేఖర్ ఉన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేద్దాం

దొర్నిపాడు: జగనన్న సురక్ష పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి విజయవంతం చేద్దామని తహసీల్దార్ జయప్రసాద్, ఎంపీడీఓ సుబ్బారెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలకు గురువారం సూచించారు. ఈ నెల 23వ తేదీ నుంచి వలంటీర్లు ధ్రువపత్రాల వివరాలను సేకరించాలన్నారు. జూలై 1నుంచి గ్రామ సచివాయాల్లో సదస్సులు ఏర్పాటు చేసి 11 రకాల పత్రాలను ఉచితంగా ఇస్తారన్నారు. 1న గుండుపాపల, 4న క్రిష్టిపాడు, 7న బుర్రారెడ్డిపల్లె, 11న చాకరాజువేముల, 13న డబ్ల్యూ.కొత్తపల్లె, 15న డబ్ల్యూ గోవిందిన్నె, 18న కొండాపురం, 20న దొర్నిపాడు–1, 22న దొర్నిపాడు–1 సచివాలయల్లో సదస్సులు ఉంటాయని చెప్పారు.

చాగలమర్రి: మండలంలోని మల్లెవేముల గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ మహబూబ్ దౌలా ఆధ్వర్యంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ నెల 24వ తేదీ నుంచి వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ధ్రువ పత్రాల అవసరం గుర్తించి మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ ఏస్ సుదర్శన్‌రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి



డీఎంఅండ్‌హెచ్‌ఓతో మాట్లాడుతున్న ఏపీ శ్యాక్స్ అధికారులు

నంద్యాలటౌన్: జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని ఐసీటీసీ, పీపీటీసీ, ఏఆర్‌టీ సెంటర్ సిబ్బందికి రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త సంచాలకులు డాక్టర్ కామేశ్వరప్రసాద్ సూచించారు. గురువారం ఆయన నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ పరీక్షలు చేసే కేంద్రాలు, గర్భిణులు, హెచ్ఐవీ బాధితులకు అందిస్తున్న కౌన్సెలింగ్, మందులు, వ్యాక్సిన్, రక్తపరీక్షలకు కావాల్సిన పరికరాలు, సరఫరాపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అధికారి డాక్టర్ బాలాజీ, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ అలీహైదర్, సుకుమార్ పాల్గొన్నారు.

జగనన్నతోనే పథకాల కొనసాగింపు సాధ్యం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

గోస్పాడు: రానున్న ఎన్నికల్లో జగనన్న మళ్లీ సీఎంగా గెలిపించుకుంటేనే పథకాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మార్కెట్ చైర్మన్ పీపీ నాగిరెడ్డితో కలిసి ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నవరత్నాలను ప్రవేశపెట్టి అధికారం చేపట్టిన నాలుగు సంవత్సరాల్లో దాదాపుగా 99 శాతం హామీలను అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ధర్మానికి, అధర్మానికి జరుగుతున్న యుద్ధంలో ధర్మం పక్షాన నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ పీపీ మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ ఓబులమ్మ, నాయకులు జనార్దన్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శేఖర్ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

ఆళ్లగడ్డ: మండలంలోని కోటకందుకూరు మెట్టవద్ద గంజాయితో వెళ్తున్న వ్యక్తులను చేసినట్లు రూరల్ ఎస్ఐ నరసింహులు గురువారం తెలిపారు. బనగానపల్లె చెందిన రాఘవేంద్రతో పాటు మరో ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి 1,400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రక్తదానం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మూడో సంవత్సర విద్యార్థి మల్లికార్జున గురువారం రక్తదానం చేసి ఒకరి ప్రాణం కాపాడినట్లు ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ గంగన్న తెలిపారు. ఆయన మాట్లాడుతూ రుద్రవరం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన అంకాలమ్మకు ఆపరేషన్ సమయంలో బీ పాజిటివ్ రక్తం అవకావం కాగా ఆమె బంధువులు అధ్యాపకులను సంప్రదించారు.

గ్రామ సభలకు సహకరించండి

రుద్రవరం: మండలంలో ఈ నెల 24 నుంచి జూలై 2వ తేదీ వరకు నిర్వహించే సామాజిక తనిఖీ గ్రామ సభలకు అందరూ సహకరించాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ప్రతాప్ కోరారు.గురువారం ఆయన మాట్లాడుతూ 2022–23 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులపై 17వ విడత సామాజిక తనిఖీ సాగుతోందని, వాటికి సంబంధించి ఉపాధి,హౌసింగ్,పీఆర్ ఇతర శాఖల్లో సాగిన పనులపై సామాజిక తనిఖీ బృందం పరిశీలించి నివేదికలు సిద్ధం చేసి ఆయా గ్రామ సచివాలయాలు, రచ్చ బండల వద్ద గ్రామ సభలు నిర్వహిస్తారని చెప్పారు.

పోస్టులు భర్తీ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఖాళీగానున్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ఎంఈఓ కార్యాలయం ఎదుట గురువారం ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమల్ల శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను భర్తీ చేయాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

విద్యాసామగ్రికి విరాళం

దొర్నిపాడు: స్థానిక ఎంపీపీ(స్పెషల్) పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు అందజేసేందుకు అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రజాక్ బాషా తన మిత్రులతో కలిసి రూ.8వేలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజా దస్తగిరికి గురువారం అందజేశారు. ఉయ్యాలవాడ మండలం హరివరం ఉన్నత పాఠశాలలో 2005 పదవ తరగతి మిత్రులంతా విరాళం ఇచ్చినట్లు చెప్పారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి

గోస్పాడు: నిర్దేశించిన ధరలకు ఎరువులు, మందులను దుకాణాదారులు విక్రయించాలని వ్యవసాయ అధికారి స్వప్నిక సూచించారు. గురువారం స్థానిక వెంకటసాయి ఎరువుల దుకాణంలో తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎరువులు, పురుగు మందుల రికార్డులను పోలీసులతో కలిసి పరిశీలించారు. ఎరువులు అమ్మకాలు, స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని చెప్పారు. కొన్ని పురుగు మందుల ధ్రువపత్రాలు సరిగా లేని కారణంగా తాత్కాలికంగా విక్రయాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఏఎస్ఐ మద్దిలేటి, సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను పకడ్బందీగా నిర్వహించండి

నంద్యాల: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న జగనన్న సురక్ష పథకం క్యాంపులను పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ నియోజకవర్గ, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పథకం అమలు తీరుపై అధికారులతో సమీక్షించారు. శామూన్ మాట్లాడుతూ వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. క్యాంపు నిర్వహించే రోజు ఉదయం 9 గంటలకే చేరుకొని సంబంధిత పత్రాలు అందజేయాలన్నారు. డివిజన్ స్థాయిలో ఆర్డీఓలు, జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ పర్యవేక్షించాలని ఆదేశించారు. డీఆర్‌ఓ పుల్లయ్య, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, నియోజకవర్గాల స్పెషల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష' ప్రారంభం

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటలకు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించనున్నారని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వర్చువల్ విధానం ద్వారా నిర్వహించే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, నంద్యాల ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొని వీక్షించాలని కోరారు.

డీఈఈ సెట్‌లో 33వ ర్యాంకు



అక్బర్‌బీని అభినందిస్తున్న దృశ్యం

గోస్పాడు: డీఈఈ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 33వ ర్యాంకును సయ్యద్ అక్బర్‌బీ సాధించారు. మండలంలోని ఒంటి వెలగల గ్రామానికి చెందిన సయ్యద్ బాషా, రెహనాబీల కుమార్తె సయ్యద్ అక్బర్‌బీ 1–10వ తరగతి వరకు గోస్పాడులో విద్యాభ్యాసం చేశారు. ఇంటర్మీడియెట్ విద్యను ఓపెన్‌లో రాసి ఫలితాలు సాధించింది. అనంతరం నిర్వహించిన డీఈఈ సెట్‌లో మంచి రాంక్ను సాధించడంతో కుటుంబ సభ్యులు,సీపీఐ నాయకులు అభినందించారు.

28న 'మోడల్' ప్రవేశ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 28వ తేదీన నంద్యాలలోని క్రాంతినగర్‌లో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఫర్హానా బేగం గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో 7వ తరగతిలో 5 ఖాళీలు, 8వ తరగతిలో 4, 9వ తరగతిలో 4 ఖాళీలు ఉన్నాయని చెప్పారు. ఖాళీలను భర్తీ చేసేందుకు ఈనెల 28న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఓసీ, బీసీకి చెందిన వారు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 రుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రైతులకు బిల్లులు ఇవ్వాలి

నంద్యాల (సెంట్రల్): విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు దుకాణదారుడు కచ్చితంగా బిల్లు ఇవ్వాలని వ్యవసాయాధికారులు ఆదేశించారు. బుధ, గురువారాల్లో జిల్లా కేంద్రంలోని పలు విత్తన దుకాణాల్లో అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వెంకటేశ్వర సీడ్స్, గురుసాయి, నాగ వెంకటేశ్వర సీడ్స్ దుకాణాల్లో నిల్వ జాబితా, ఉత్పత్తుల్ని క్షుణ్ణంగా పరిశీలించారు. నాగ వెంకటేశ్వర దుకాణంలో అనుమతులు లేని రూ.12.50 లక్షల విలువజేసే వరి విత్తనాల అమ్మకాలను నిలుపివేశారు. జీవ నియంత్రణ ప్రయోగశాల ఏడీఏ సుధాకర్, నంద్యాల ఏడీఏ రాజశేఖర్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, నంద్యాల ఏవో ప్రసాద్ రావు పాల్గొన్నారు.

నంద్యాల(సిటీ): పట్టణంలోని 35వ వార్డు సచివాలయాన్ని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులతో పాటు సిబ్బంది హాజరు నమోదు రిజిస్టర్‌ను పరిశీలించారు.



చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చేరిన వర్షపునీరు



దొర్నిపాడు సమీపంలోని పొలాలు పదునెక్కిన దృశ్యం

భారీ వర్షం

దొర్నిపాడు: మండలంలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సాయంత్రం పూట వాతావణంలో ఒక్క సారిగా మార్పులు చేటుచేసుకొని వర్షం పడుతోంది. బుధవారం మండలంలో 15.2 మి.మీ వర్షపాతం నమోదైందని తహసీల్దార్ జయప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ సాగుకు అనుకూలంగా మారాయని రైతులు పేర్కొంటున్నారు.

చాగలమర్రి: మండలంలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. 5.8 సెం.మీ. వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. భారీ వర్షం కువరడంతో పట్టణంలోని పలు ప్రధాన రోడ్లు, కాలనీలు జలమయమయ్యాయి. తహసీల్దారు కార్యాలయం, ప్రక్కనే ఉన్న ప్రాథమిక మెయిన పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోయింది. గాంధీ సెంటర్‌లో భారీగా నీరు నిలిచిపోయింది. ఇక ముత్యాలపాడు బస్టాండ్, పెద్దమకానం, పాత బస్టాండులలోని రోడ్ల వర్షపు నీరు ప్రవహించింది.